## క్లుప్తంగా

### నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కొరిటిపాడు: నెహ్రూనగర్ ఉపకేంద్రం పరిధిలో మోతిలాల్ నగర్ ఫీడర్ మరమ్మతుల నిమిత్తం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని విద్యుత్‌శాఖ గుంటూరు టౌన్–4 డెప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ హెచ్.ఖాన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నెహ్రూనగర్ ఒకటవ లైన్ నుంచి 9వ లైన్ వరకు, మోతిలాల్ నగర్ తదితర ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు వెల్లడించారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

### విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ



గుంటూరు ఎడ్యుకేషన్: సంగడిగుంటలోని బాపూజీ విద్యాసంస్థల్లో చదువుతున్న పేద విద్యార్థులకు గురువారం శ్రీ బాలల సేవా సమితి ఆధ్వర్యంలో సైకిళ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బాపూజీ విద్యాసంస్థల కార్యదర్శి కర్పూరపు రామకృష్ణ మాట్లాడుతూ పేద విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ, వస్త్రదానం చేయడం అభినందనీయమన్నారు. చదువుకోవాలనే ఆసక్తి, కుటుంబ ఆర్థిక పరిస్థితులు అనుకూలించకపోవడంతో చదువును కొనసాగించలేకపోతున్నవారిని శ్రీ బాలల సేవ సమితి ప్రయోజనకరమైన కార్యక్రమాలను నిర్వహిస్తోందన్నారు. తమకున్న కొద్దిపాటి ఆదాయంలోనే ఇటువంటి మంచి కార్యక్రమాలు చేయడం ద్వారా ఎంతోమందికి మార్గదర్శకంగా నిలుస్తున్నారన్నారు. బాలల సేవా సమితి వ్యవస్థాపక చైర్మన్ కర్పూరపు గోవర్ధిని మాట్లాడుతూ ఆర్థిక బ్బందులతో చదువును కొనసాగించలేకపోతున విద్యార్థులకు ప్రతి నెలా ఉపకార వేతనాలు అందిస్తున్నామని తెలిపారు. సైకిళ్ల పంపిణీ కార్యక్రమానికి రేమాండ్స్ సంస్థ అధినేత త్రిపురమల్లు అరుణ్‌కుమార్, పద్మావతి సహాయ, సహకారాలను అందించారని వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ మహంకాళి శ్రీనివాసరావు, రమాదేవి, సుభద్ర, వాణి వెంకట్, రాధిక, కమల, నిర్మల, విజయలక్ష్మి, సత్యవతి పాల్గొన్నారు.

### సామాజిక చైతన్య జ్యోతులు గురువులు



గుంటూరు ఎడ్యుకేషన్: గురువులు సామాజిక చైతన్య జ్యోతులని తులసీ సీడ్స్ మేనేజింగ్ డైరెక్టర్ తులసి యోగేష్‌చంద్ర అన్నారు. గురువారం పట్టాభిపురంలోని టీజేపీఎస్ కళాశాలలో మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా ముందస్తు ఉపాధ్యాయ దినోత్సవాన్ని జరుపుకొన్నారు. ముఖ్య అతిథిగా మానవ జీవితం ఎటువంటి అడ్డంకులు, ఒడిదుడుకులు లేకుండా ప్రశాంతంగా ముందుకు వెళ్లాలంటే ప్రతి ఒక్కరికీ మంచి గురువు అవసరమన్నారు. ఏ రంగంలో రాణించాలన్నా గురువు ఆశీస్సులు ఉండాలని, ఎటువంటి ప్రతిఫలాపేక్ష లేకుండా, తన శిష్యులు పొందిన విజయాలలో ఆనందాన్ని చూసే వ్యక్తి, ప్రపంచానికి మార్గ నిర్దేశనం చేసే శక్తి గురువులది పేర్కొన్నారు. కళాశాల కరస్పాండెంట్ కేవీ బ్రహ్మం మాట్లాడుతూ అజ్ఞానాన్ని రూపుమాపి వెలుగులను పంచే గురువులను సత్కరించుకోవడం గొప్ప విషయమన్నారు. అనంతరం అధ్యాపక బృందాన్ని సత్కరించారు. పీజీ, డిగ్రీ ప్రిన్సిపాల్స్ డాక్టర్ ఎస్.అనితా దేవి, డాక్టర్ కె.కామేశ్వరశాస్త్రి, వైస్ ప్రిన్సిపాల్ భాను మురళీధర్, ఇంటర్ క్యాంపస్ ఇన్‌చార్జ్ జి.సురేష్ కుమార్, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

### ఉపాధ్యాయుల కృషి మరువలేనిది



గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థులను క్రమశిక్షణతో కూడిన విజ్ఞానవంతులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల కృషి మరువలేనిదని ఆక్స్‌ఫర్డ్ విద్యాసంస్థల చైర్మన్ ఎస్.ఫ్రాన్సిస్ రెడ్డి పేర్కొన్నారు. బృందావన్‌గార్డెన్స్‌లోని ఆక్స్‌ఫర్డ్ పాఠశాలలో మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి జయంతి సందర్భంగా గురువారం ముందస్తు ఉపాధ్యాయ దినోత్సవాన్ని జరుపుకొన్నారు. ఈసందర్భంగా ఫ్రాన్సిస్‌రెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయుడిగా విద్యార్థులను సన్మార్గంలో నడిపిన సర్వేపల్లి రాధాకృష్ణన్ రాష్ట్రపతిగా ఎదిగిన తరువాత సైతం విద్యాబోధనపై మక్కువ వీడలేదన్నారు. ఈసందర్భంగా ఉపాధ్యాయ బృందాన్ని సత్కరించారు. పాఠశాల వైస్ చైర్మన్ ఆరోన్ రెడ్డి, డైరెక్టర్లు విజయభాస్కర్‌రెడ్డి, జోసఫ్ రెడ్డి, ప్రిన్సిపాల్ అమీనాబేగం, హెడ్‌మాస్టర్లు ఎస్.మనోహర్‌రావు, డిప్యూటీ హెడ్ టీచర్ ఎస్.అనూష, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# విఘ్నాలు తొలగాలి.. విజయాలు కలగాలి

- నగరంలో ఘనంగా గణపతి పూజలు
- పలు చోట్ల ఉత్సాహంగా నిమజ్జనాలు
- భారీగా అన్నదానాలు



గణేష్ పూజల అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న అంబటి రాంబాబు

పట్నంబజారు: వినాయక చవితి నవరాత్రులు పురస్కరించుకుని వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ జిల్లా అధ్యక్షుడు, పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త అంబటి రాంబాబు చవితి పందిళ్లలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గుంటూరు నగరంలోని గుంటూరువారితోటలో గుంటూరు వారితోట ఫ్రెండ్స్ సర్కిల్, ఏలూరి అనిల్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చవితి వేడుకల్లో అంబటి దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం 28వ డివిజన్‌పరిధిలోని వెంకటరమణ కాలనీలో హార్డ్‌వేర్ షాపు కుమార్ ఆధ్వర్యంలో జరిగిన చవితి వేడుకల్లో పాల్గొన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం ప్రారంభించారు. 46వ డివిజన్ పరిధిలోని ద్వారకా నగర్‌లో లక్కాకుల మరియన్న ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో పాల్గొని అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. 29వ డివిజన్ నల్లకుంటలో ప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో పూజలు నిర్వహించి అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా అంబటి రాంబాబు మాట్లాడుతూ విఘ్నేశ్వరుడి దయతో ప్రతి ఒక్కరికి విఘ్నాలు తొలగి మంచి జరగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు, ఆయా చవితి పందిళ్ల నిర్వాహకులు పడాల సుబ్బారెడ్డి, సూరసాని వెంకటరెడ్డి, వెంకటరెడ్డి, షేక్ రోషన్, పఠాన్ సైదాఖాన్, అనిల్, రమేష్, అంకారావు, గోవింద్, వల్లి, తదితరులు పాల్గొన్నారు.



జిల్లా కోర్టులో మహా గణపతి నిమజ్జన కార్యక్రమానికి హాజరైన న్యాయవాదులు

### విఘ్నేశ్వరుడి పూజతో విఘ్నాలు దూరం

పట్నంబజారు: ప్రతి ఒక్కరూ భక్తితో ఆదిదేవుడు విఘ్నేశ్వరుడిని పూజించడంతోపాటు, సేవా కార్యక్రమాలు పెద్ద ఎత్తున నిర్వహించడం అభినందనీయమని వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ నగర అధ్యక్షురాలు, తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరిఫాతిమా చెప్పారు. నియోజకవర్గంలోని 5, 13, 17 డివిజన్‌ల పరిధిలో జరిగిన వినాయక చవితి ఉత్సవాల్లో పాల్గొని అన్నదాన కార్యక్రమాలు ప్రారంభించారు. ఈసందర్భంగా నూరిఫాతిమా మాట్లాడుతూ ఎంతో భక్తిశ్రద్ధలతో వినాయకుడిని కొలిచి, ప్రతి ఒక్కరికి విఘ్నాలు తొలగిపోవాలని నిత్యం పూజలు జరిపించడం సంతోషదాయకమన్నారు. ఈ కార్యక్రమంలో 17వ డివిజన్ కార్పొరేటర్ షేక్ ఫర్జానా, వైఎస్సార్ సీపీ నేతలు ఇషాక్, అనిల్, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.



అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న నూరిఫాతిమా

### జిల్లా కోర్టులో గణపతి ఉత్సవాలు

గుంటూరు లీగల్: జిల్లా కోర్టులో ఉత్సవ కమిటీ న్యాయవాదుల ఆధ్వర్యంలో తొమ్మిది రోజులు మహాగణపతి పూజ కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గురువారం మహా గణపతి నిమజ్జన కార్యక్రమం నిర్వహించారు. మహిళల కోలాటం నడుమ న్యాయవాదుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. వేలంలో గణనాథుని లడ్డూను న్యాయవాది దాసరి ఉమామహేశ్వరరావు (చిన్న ఉమ) రూ.1.60 లక్షలకు దక్కించుకున్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు అధిక సంఖ్యలో పాల్గొని భక్తిశ్రద్ధలతో మహాగణపతి ఆశీస్సులు పొందారు.

### ‘టారిఫ్‌ల పెంపు’ నిరసనల్లో పాల్గొనండి

లక్ష్మీపురం: అమెరికా టారిఫ్‌ల పెంపునకు వ్యతిరేకంగా నిరసనలకు వామపక్షాలు పిలుపునిచ్చాయని, శుక్రవారం జరిగే కార్యక్రమాల్లో ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సి.హెచ్.బాబురావు పిలుపునిచ్చారు.

గుంటూరు బ్రాడీపేటలోని పార్టీ జిల్లా కార్యాలయంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఈమని అప్పారావు అధ్యక్షతన గురువారం జరిగిన జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ అమెరికా అధ్యక్షుడు భారతీయ సరుకుల దిగుమతులపై సుంకాన్ని 50శాతం విధించారన్నారు. ఈ నేపధ్యంలో మన ఉత్పత్తులపై తీవ్ర ప్రభావం పడుతుందన్నారు. ఆక్వా, టెక్స్‌టైల్, గార్మెంట్స్ వంటి ఉత్పత్తుల ధరలు అమెరికాలో ఘోరంగా పెరిగాయని, ఏటా సుమారు రూ.2వేల కోట్ల డాలర్ల విలువైన ఆక్వా ఉత్పత్తులు మన రాష్ట్రం నుంచి అమెరికాకు ఎగుమతి అవుతున్నాయన్నారు. రొయ్యలు, చేపల రైతులు తీవ్ర సంక్షోభంలో చిక్కుకున్నారన్నారు. గుంటూరు జిల్లాలో స్పిన్నింగ్ మిల్లులపై ప్రభావం పడుతుందని, వీటిల్లో ఎక్కువగా మహిళా శ్రామికులు పనిచేస్తున్నారని తెలిపారు.

పార్టీ జిల్లా కార్యదర్శి వై.నేతాజీ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పేదలకు ఇళ్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. తురకపాలెం గ్రామంలోని అసాధారణ మరణాలపై సమగ్ర నివేదిక తయారు చేయాలని, మృతుల కుటుంబాలకు రూ. 25లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేశారు. సీపీఎం నాయకులు ఎస్.భావన్నారాయణ, ఎన్.నళినీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# తాగునీటి సరఫరాలో అప్రమత్తత

- అధికారులకు కమిషనర్ శ్రీనివాసులు ఆదేశాలు
- నగరంలో పలు ప్రాంతాల్లో పర్యటన



సరఫరా అయిన తాగునీటిని పరిశీలిస్తున్న కమిషనర్ పులి శ్రీనివాసులు

నెహ్రూనగర్: గుంటూరు నగరంలో తాగునీటి సరఫరాపై ఇంజినీరింగ్ అధికారులు అప్రమత్తంగా ఉండాలని, ఎక్కడైనా కలుషిత నీటి సరఫరాపై ఫిర్యాదులు అందితే యుద్ధ ప్రాతిపదికన స్పందించాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు స్పష్టం చేశారు. గురువారం కమిషనర్ రెడ్లబజార్, పాత గుంటూరు, కుందుల రోడ్, జేకేసీ కాలేజీ రోడ్డు, శ్రీనివాసరావు తోట తదితర ప్రాంతాల్లో పర్యటించారు. శ్రీనివాసరావు తోటలో తాగునీటి సరఫరాపై అందిన ఫిర్యాదును నేరుగా పరిశీలించి, మాట్లాడుతూ నగరంలో తాగునీటి సరఫరా పైప్‌లైన్లు ఎక్కడైనా డ్రెయిన్‌లలో ఉంటే వాటిని వెంటనే షిఫ్ట్ చేయాలన్నారు. వార్డ్ సచివాలయాల వారీగా ఎమినిటి కార్యదర్శులు తప్పనిసరిగా తాగునీటి సరఫరా సమయంలో శ్యాంపిల్స్ తీయాలన్నారు. పైప్ లైన్లకు లీకులు, కలుషిత సరఫరా గుర్తిస్తే తక్షణ చర్యలు తీసుకోవాలని, నిర్లక్ష్యంగా ఉంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయా ప్రాంతంలో పారిశుద్ధ్య పనులపై అసంతృప్తి వ్యక్తం చేసి, మెరుగైన పనితీరు ఉండాలని శానిటేషన్ కార్యదర్శి, ఇన్‌స్పెక్టర్‌ని ఆదేశించారు. శ్రీనివాసరావుతోట 60 అడుగుల రోడ్, కుందుల రోడ్‌లో ఆక్రమణలను తొలగించాలని పట్టణ ప్రణాళిక అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో పట్టణ ప్రణాళిక, ఇంజినీరింగ్, ప్రజారోగ్య అధికారులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

**నగరాభివృద్ధిలో యూనిడో సహకారం విలువైనది...**

నెహ్రూనగర్: నగరాభివృద్ధిలో యునైటెడ్ నేషన్స్ ఇండస్ట్రీయల్ డెవలప్మెంట్ ఆర్గనైజేషన్ (యూనిడో) సహకారం విలువైనదని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. గురువారం నగరంలో యూనిడో సహకారంతో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను, సోలార్ ఫ్లోటింగ్ ప్లాంట్‌ని పరిశీలించడానికి వచ్చిన యూనిడో ఇంటర్నేషనల్ ఎవాల్యుయేటర్ రోలాండ్ వాంగ్, నేషనల్ ఎవాల్యుయేటర్ డాక్టర్ శ్రీనివాస్ ష్రాఫ్, సీనియర్ టెక్నికల్ అడ్వైజర్ డాక్టర్ నందపాల్ సింగ్, నేషనల్ ప్రాజెక్ట్ కో–ఆర్డినేటర్ దీపికా శ్రీపాద్ లేలేలతో నగరపాలక సంస్థ కమిషనర్ చాంబర్‌లో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ కాలుష్యరహిత నగరంగా గుంటూరు నగరాన్ని మార్చుకోవడంలో యూనిడో గ్లోబల్ ఎన్విరాన్మెంట్ ఫండ్ (జీఈఎఫ్) సంపూర్ణ సహకారం అందిస్తుందన్నారు. ఇప్పటికే సంగం జాగర్లమూడి సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్‌లో ఫ్లోటింగ్ సోలార్ ప్యానల్స్ ఏర్పాటుకు, ఈ–ఆటోలకు నిధులు అందించారన్నారు. యూనిడో సహకారం వలన రానున్న కాలంలో గుంటూరు నగరం స్వచ్ఛ నగరంగా, కాలుష్య రహిత నగరంగా అభివృద్ధి చేసుకోవడానికి తగిన ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. త్వరలో గుజరాత్, ఛండీఘడ్‌ల నుంచి అధ్యయన బృందాలు కూడా రానున్నాయన్నారు. త్వరలో సీ అండ్ డీ ట్రీట్మెంట్ ప్లాంట్, బయో సీఎన్‌జీ ప్లాంట్, మాంస వ్యర్థాల ప్రాసెస్ యూనిట్, స్లాటర్ హౌస్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. యూనిడో బృంద సభ్యులు మాట్లాడుతూ భవిష్యత్‌లో నగరాభివృద్ధిలో యూనిడో నుంచి సంపూర్ణ తోడ్పాటు ఇస్తామని తెలిపారు. ఇన్‌ఛార్జ్ ఎస్ఈ సుందరరామిరెడ్డి, సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ స్పెషలిస్ట్ అనిల్ కుమార్ పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే నసీర్ అహ్మద్‌కు నిరసన సెగ



నిరసన వ్యక్తం చేస్తున్న బీజేపీ నేతలు

- ఫ్లెక్సీలో ప్రధాని మోదీ ఫొటో ఏర్పాటు చేయకపోవటంపై బీజేపీ నేతల మండిపాటు
- తమకు ప్రాధాన్యత లేకుండా పోయిందని టీడీపీ సీనియర్ నేతల అసహనం

పట్నంబజారు: గుంటూరు తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే ఎండీ నసీర్ అహ్మద్‌కు నిరసన సెగ తగిలింది. ఎమ్మెల్యే తీరుపై బీజేపీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏటుకూరు రోడ్డులో గురువారం సూపర్ సిక్స్.. స్త్రీ శక్తి సక్సెస్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. సభలో, బయట ఏర్పాటు చేసిన ఫ్లెక్సీల్లో ప్రధాని నరేంద్రమోదీ ఫొటో ఏర్పాటు చేయకపోవడంతో బీజేపీ నేతలు, క్యాడర్ మొత్తం బయటకు వచ్చి పెద్ద ఎత్తున నసీర్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఎమ్మెల్యే నసీర్‌అహ్మద్ ప్రతిసారి బీజేపీని అగౌరవపరుస్తూనే ఉన్నారని, నియంతలా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ఈ క్రమంలో అక్కడే ఉన్న ఎమ్మెల్సీ ఆలపాటి రాజా, పలువురు టీడీపీ నేతలు సర్దిచెప్పే యత్నం చేసినప్పటికీ.. ససేమిరా అంటూ అక్కడ నుంచి వెళ్లిపోయారు. కార్యక్రమం సాయంత్రం 4.30 గంటలకు అని ప్రకటించారు. సాయంత్రం ఆరు గంటలు అయినప్పటికీ.. ఎమ్మెల్యే సభా ప్రాంగణానికి రాకపోవటంతో మహిళలు, కూటమి కార్యకర్తలు కోపంతో బయటకు వచ్చే ప్రయత్నం చేశారు. నేతలు సర్దిచెప్పే, బెదిరించే యత్నం చేసినా.. ‘ మీకు చేతనైంది చేసుకోండి’ అంటూ అక్కడ నుంచి మహిళలు వెళ్లిపోయారు.

### 21న జాషువా పద్య పఠన పోటీలు

లక్ష్మీపురం: నవయుగ కవి చక్రవర్తి గుర్రం జాషువా 130వ జయంతి సందర్భంగా ఈ నెల 21 ఆదివారం జాషువా పద్య పఠన పోటీలు నిర్వహిస్తున్నట్లు గుర్రం జాషువా విజ్ఞాన కేంద్రం కార్యక్రమాల నిర్వహణ కమిటీ కన్వీనర్ ఎస్.భావన్నారాయణ గురువారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ పోటీలు సీనియర్స్, జూనియర్స్ (విద్యార్థులు) విభాగాలలో జరుగుతాయని ఆయన తెలిపారు. పోటీల ముగింపులో బహుమతి ప్రదానం జరుగుతుందని తెలిపారు. 21వ తేదీ ఉదయం 10 గంటలకు నుంచి 2/7 బ్రాడీపేట జాషువా విజ్ఞాన కేంద్రంలో పోటీలు ప్రారంభమవుతాయని తెలియజేశారు. పోటీలు పీ.వీ.రమణ, జి.లూథర్ పాల్ ఆధ్వర్యంలో జరుగుతాయని ఆసక్తిగల వారు వారిని సంప్రదించాలని కోరారు. ఇతర వివరాలకు 8639216049, 7569116080 నెంబర్లలో సంప్రదించాల్సిందిగా తెలిపారు.


### అమరావతిలో ప్రభుత్వ విద్యాలయాలు ఏర్పాటు చేయాలి

రాజధాని ప్రాంత అభివృద్ధి వేదిక డిమాండ్



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న వేదిక కన్వీనర్, మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు

లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్): రాజధాని అమరావతిలో ప్రభుత్వ విశ్వవిద్యాలయాలు, కళాశాలలు ఏర్పాటు చేయాలని రాజధాని ప్రాంత అభివృద్ధి వేదిక కన్వీనర్, మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు డిమాండ్ చేశారు. గుంటూరు బ్రాడీపేటలో గుర్రం జాషువా విజ్ఞాన కేంద్రంలో గురువారం రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేశారు. కార్యాక్రమంలో లక్ష్మణరావు మాట్లాడుతూ వీఐటీ, ఎస్ఆర్ఎం ప్రైవేటు యూనివర్సిటీలకు గతంలో 200 ఎకరాల చొప్పున భూములు ఇచ్చారని, ఇప్పుడు మరో 100 ఎకరాలు చొప్పున ఇవ్వాలని నిర్ణయించారన్నారు. కానీ ఆ రెండు యూనివర్సిటీలు రాజధాని ప్రాంత విద్యార్థులకు సీట్ల కేటాయింపు గానీ, ఫీజులలో ఎటువంటి రాయితీలు గానీ ఇవ్వడం లేదన్నారు. ఈ ప్రాంతంలో అమరావతి విశ్వవిద్యాలయం పేరుతో సామాజిక శాస్త్రాలకు హ్యూమానిటీస్‌కు ఒక విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ప్రొఫెసర్ డీఏఆర్ సుబ్రమణ్యం మాట్లాడుతూ తుళ్లూరు ప్రాంతంలో అధునాతన కోర్సులతో డిగ్రీ కళాశాల, ఒకేషనల్ కోర్సులతో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలని కోరారు. రాజ్యాంగ చర్చా వేదిక నాయకులు అవధానుల హరి మాట్లాడుతూ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ యూనివర్సిటీని ప్రైవేట్ రంగంలో కాకుండా ప్రభుత్వమే ఏర్పాటు చేయాలని తెలిపారు. విద్యావేత్త ఆర్.రాము, ఎస్ఎఫ్ఐ కార్యదర్శి సమీర్, ప్రొఫెసర్ ఎం.వెంకటేశ్వరరావులు మాట్లాడారు. రౌండ్ టేబుల్ సమావేశంలో రైతు సంఘ నాయకులు కె.అజయ్‌కుమార్, రాజధాని ప్రాంత నాయకులు ఎం.రవి, భాగ్యరాజు, నవీన్ ప్రకాష్, ఆవాజ్ రాష్ట్ర కార్యదర్శి చిష్టి, మహిళా సంఘ నాయకులు అవగాహన సంస్థ కార్యదర్శి కొండాశివ రామిరెడ్డి, భావన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.



### శాక గణపతి

స్థానిక ఏటుకూరురోడ్డు శ్రీకన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానం వద్ద కొలువైన గణనాథుడిని గురువారం శాక గణపతిగా అలంకరించారు. వాసవి యూత్ 27వ గణేష్ చతుర్థి నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా స్వామి వారికి పంచామృతాలతో అభిషేకం, సహస్ర నామార్చనను వేద పండితులు నిర్వహించారు. స్వామి వారిని వివిధ రకాల కూరగాయలతో అలంకరించారు. వాసవి యూత్ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు తూనుగుంట్ల నాగేశ్వరరావు, కార్యదర్శి పువ్వాడ నాగవెంకటనారాయణ తదితరులు పాల్గొన్నారు.

– నగరంపాలెం